క్లుప్తంగా

ఎండీఎం ఏజెన్సీల సమస్యలు పరిష్కరించాలి



పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని ఆలూర్ మండలం మధ్యాహ్న భోజనం (ఎండీఎం) ఏజెన్సీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం ఎంఈవో మేస నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ.10వేల వేతనం చెల్లించాలని, కోడి గుడ్డు ధరను రూ.6కు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఆలూర్‌లో ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఏజెన్సీల బిల్లులను ఆర్మూర్ నుంచి కాకుండా ఇక్కడి నుంచే చెల్లించాలన్నారు. బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మండల ఎండీఎం కార్మికుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ బరువు కాదు.. రక్షణ



రెంజల్(బోధన్): వాహనదారులు హెల్మెట్‌ను బరువుగా కాకుండా రక్షణగా గుర్తించి తప్పని సరిగా ధరించాలని రెంజల్ ఎస్సై సాయన్న పేర్కొన్నారు. రెంజల్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు పోలీసు కళాబృందం సభ్యులు ఆట, పాటలు, నాటికల ద్వార పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ.. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. మండల నోడల్ అధికారి ఆంజనేయులు, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



వర్ని: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వర్ని మండల కేంద్రంలో వారు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని లేకపోతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. నాయకులు కైరి శశిధర్, ప్రవీణ్, సంజయ్, జగదీష్, దత్తు, అనిల్, ప్రభు, పవన్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



నందిపేట్(ఆర్మూర్): ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. నందిపేట మండల కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నిధులను మేమిచ్చామంటూ కాంగ్రెస్ మోసం చేస్తుందన్నారు. నందిపేట్‌లో గతంలో రూ.44 లక్షల నిధులను గ్రంథాలయం భవనం నిర్మాణం కోసం గత ప్రభుత్వం కేటాయిస్తే ఈరోజు కాంగ్రెస్ నాయకులు వచ్చి మేము ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారనీ విమర్శించారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పనుల కోసం విడుదల చేసిన నిధులను కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం కక్కుర్తి పడి పనులను ఆపుతున్నారని ఆరోపించారు. నాయకులు మచ్చర్ల సాగర్, ఎర్రం మురళి, దుబాయ్ శీను, దడిగే ప్రవీణ్ పాషా, ఎస్వీ సతీష్, సంతోష్, రాజేందర్, సాగర్, అశోక్, రాజ్‌కుమార్, సతీష్‌స్వామి, శేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

బోధన్‌టౌన్ (బోధన్): పట్టణంలో గతంలో పలువురు ఫోన్లు పోగొట్టుకోగా, పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం నాలుగు ఫోన్లను రికవరీ చేశారు. అనంతరం బాధితులకు ఫోన్లను సీఐ వెంకటనారాయణ అందజేశారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల బెడద తీరేదెన్నడో?

- గ్రామాల్లో స్వైర విహారం
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రెంజర్లలో రహదారిపై కుక్కల గుంపు

బాల్కొండ: గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువ అవుతోంది. దీంతో గ్రామాల్లో ప్రజలు ఒంటరిగా బయటకు రావాలంటే తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని ఏ గ్రామంలో చూసిన కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి. దీంతో గ్రామంలో రోడ్డు వెంట నడుచుకుంటు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కుక్కలు చుక్కలు చూపుతున్నాయి. వారిని వెంటాడి మరి దాడి చేయడంతో బైక్ నడిపే వారు భయాందోళనకు గురవుతు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా రోజు ఎక్కడో ఓ చోట ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పిచ్చి కుక్కలు కూడ స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల స్వైర విహారంపై పలుమార్లు పంచాయతీల్లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వీధి కుక్కల స్వైరవిహారానికి చెక్ పెట్టే కార్యక్రమాలపై దృష్టిపెట్టడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

కాలనీలో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నా యి. దీంతో కాలనీలో తిరగాలంటే ఇబ్బందిగా ఉంది. చిన్న పిల్లలను రోడ్డుపైకి పంపించే అవకాశం లేకుండ ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి

– సోహెల్, గ్రామస్తుడు

భయపడుతున్నాం..

వీధి కుక్కల స్వైర విహారంతో భయపడుతున్నాం. కుక్కలు ఎక్కువగా సంచరిస్తూ రోడ్డుపై వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. బైక్‌ల వెంట కూడ పడుతున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకొని వెంటనే కుక్కల బెడదను తొలిగించాలి.

–దశరథ్, గ్రామస్తుడు

■ పాత పింఛన్ సాధనకు కృషి



పెర్కిట్(ఆర్మూర్): పాత పింఛన్ విధానాన్ని సాధించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు సీపీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణా రావు అన్నారు. ఆర్మూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు పెర్కిట్ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానం సాధించే వరకు అలుపెరగని పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు 010 జీవో ద్వారా వేతనాలు ఇవ్వాలని, మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకంతోపాటు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం..

■ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



ఆర్మూర్: పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కార మార్గాలు చూస్తానని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాలం విద్యాసాగర్ పేర్కొన్నారు. ఆర్మూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దల సభలో ఉన్నప్పుడే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపే అవకాశం ఉందన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

■ ఓటు హక్కు కోసం నమోదు చేయించుకోవాలి



ఆర్మూర్: పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేయించుకోవాలి అని నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి మదనం గంగాధర్ పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు తాను లక్ష మంది ఓటర్లను నమోదు చేయించానన్నారు. తన గెలుపు కోసం రెండు వేల మంది పనిచేస్తున్నారన్నారు. ఏదైనా రాజకీయ పార్టీ నుంచి అవకాశం వస్తే ఆ పార్టీ నుంచి పోటీ చేయడానికి ఆలోచిస్తానన్నారు. తాను ప్రస్తుతం ఓటర్ల నమోదుపైనే నిమగ్నమై ఉన్నానన్నారు. కష్టపడితే విజయం ఉంటుందని, పోరాటం, కృషి, పట్టుదలతో డీఎస్పీ స్థాయికి ఎదిగి స్వచ్ఛంద పదవీ విరమణ చేసి గెలుపుపై ధీమాతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానన్నారు.

బాలికల ఆత్మరక్షణకే కరాటే శిక్షణ





కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో కరాటే సాధన చేస్తున్న విద్యార్థినులు.. మాక్లూర్ కస్తుర్బా పాఠశాలలో..

కమ్మర్‌పల్లి/మాక్లూర్: బాలికల ఆత్మరక్షణ కోసమే కరాటే శిక్షణ ఇస్తున్నట్లు కరాటే మాస్టర్లు పేర్కొన్నారు. మాక్లూర్, కమ్మర్‌పల్లి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ బడుల్లో మంగళవారం ఝాన్సీలక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా బాలికలు ఈవ్‌టీజింగ్‌కు గురైనప్పుడు ఎదుటి వ్యక్తిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాన్ని ప్రధానంగా తీసుకుని తమనుతాము రక్షించుకోవటానికి తగిన శిక్షణ ఇచ్చారు. బాలికలు సైతం ఉత్సాహంతో శిక్షణలో పాల్గొన్నారు. హెచ్‌ఎం సాయన్న, పీడీ నాగభూషణం, రోహిత్, కోచ్ గంగోనే వినోద్, ప్రత్యేకాధికారి స్రవంతి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



మాక్లూర్/రుద్రూర్: మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో మంగళవారం మండల పశువైద్యాధికారులు ఉమా సహేర్, కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు టీకాలు వేశారు.పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో పశువులకు టీకాల కార్యక్రమాన్ని కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు ప్రారంభించారు. పశువైద్య సిబ్బంది సురేష్ కుమార్, సుధీర్ గౌడ్, వినిత, కల్యాణి, అహ్మద్ పాష, గంగాధర్, శ్యామల, పుష్ప, మహేశ్వరీ, సుధీర్, సలీం, పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దాశరథి వర్ధంతి సభ



నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ పోరాట యోధుడు దాశరథి వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని తెలంగాణ గొప్పతనాన్ని చాటిచెప్పిన గొప్ప కవి అని వారు పేర్కొన్నారు. గంగాధర్, సిలిండర్ లింగం, తమ్మల దేవేందర్, ఎస్వీ సతీష్, కుమ్మరి చిన్నయ్య, దామోదర్, పాష తదితరులు పాల్గొన్నారు

హాలోవీన్స్ డే



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్మైల్స్ ద స్కూల్‌లో మంగళవారం హాలోవీన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రఫీ గోహర్ మాట్లాడుతూ.. పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారులు రకరకాల దుస్తులను ధరించి అలరించారు. కరస్పాండెంట్ షబానా గోహర్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లయన్స్ భవన్‌లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు చెరుకు పృథ్వీరాజ్, భుజంగరావు, ద్యాగ ఉదయ్, పవన్ పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌లో పంచాయతీ కార్మికుడు స్వామి కరెంట్ షాక్‌తో ప్రమాదానికి గురయ్యాడు. బాధితుడికి మంగళవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ 2006–07 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు.

బదిలీపై వెళ్లిన ఎంఈవోకు సన్మానం



వేల్పూర్: వేల్పూర్ ఎంఈవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన వనజకు మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో బాలకిషన్‌లు కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ఆమె సేవలను కొనియాడారు. నూతన ఎంఈవో రేణుక, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజన్న, మల్లేష్, దేవానందం, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఎమ్మెల్యేకు..



రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం రుద్రూర్ మండల కాంగ్రెస్ నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపి, సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. అరుణ్ కుమార్, సరోజి గంగారాం, సంగయ్య, బాలరాజు, శంకర్ ఉన్నారు.

చెట్లను కాపాడుకోవాలి



వర్ని: ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లను పెంచడంతోపాటు, కాపాడుకోవాలని వర్ని జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో మంగళవారం మదర్ ట్రీని పూజించారు. మొక్కలను నాటడం, చెట్లను కాపాడుకునే విధానం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థినికి అభినందన



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ కేజీబీవీ కళాశాల విద్యార్థిని శ్రీనిధి అండర్–19 రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేక అధికారిణి గంగామణి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని మంగళవారం ప్రత్యేక అధికారిణి, అధ్యాపకులు అభినందించారు. పీఈటీ వీణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

టాయిలెట్స్ నిర్మించాలి

రుద్రూర్: జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ (ఎన్టీఆర్ చౌరస్తా) వద్ద మంచినీటి సౌకర్యంతో పాటు, మహిళలకు టాయిలెట్స్, మరుగుదొడ్లు నిర్మించి, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి నన్నే సాబ్ కోరారు. రుద్రూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధర్నాచౌక్ వద్ద టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చేప పిల్లల పంపిణీ



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గంగపుత్ర సంఘం సభ్యులకు మంగళవారం ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఉచితంగా సరఫరా చేసిన చేప పిల్లలను అధికారులు పంపిణీ చేశా రు. 2.62 లక్షల చేప పిల్లలను అందజేయగా గంగపుత్రులు స్థానిక కాడి చెరువు, చింతల చెరువులో వదిలారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఏవో రమ్యశ్రీ, ఎంపీవో సదాశివ్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



బోధన్‌లో మాట్లాడుతున్న ఎంఈవో నాగయ్య



సమావేశంలో పాల్గొన్న హెచ్‌ఎంలు

బోధన్: పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని బోధన్ ఎంఈవో నాగయ్య, హెచ్‌ఎంలను ఆదేశించారు. పట్టణంలోని డివిజన్ డిప్యూటీ డీఈవో కార్యాలయంలో మంగళవారం మండలస్థాయి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర విద్యా సంచాలకులు నిర్వహించిన ఎంఈవోల సమావేశ వివరాలను వెల్లడించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని తెలిపారు. హెచ్‌ఎంలు రత్నాకర్, ఆరిఫోద్దీన్, జ్యోతి, సూర్యకుమార్, సీఆర్‌పీలు విజయ్, బాబు, యూసుఫ్, శివానంద్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

మోర్తాడ్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలను సమకూర్చాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. భీమ్‌గల్ మండలంలోని బడాభీమ్‌గల్, చెంగల్, బాబాపూర్, పల్లికొండలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. సహకార సంఘాలు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలని వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

■ 13 నుంచి భీమన్న ఉత్సవాలు



పెర్కిట్(ఆర్మూర్): చేపూర్ గ్రామంలో ఈ నెల 13 నుంచి 15వరకు ఆదివాసీల ఆరాధ్య దైవం భీమన్న దేవుని ఉత్సవాలను ఘనంగా నిర్వహిహించనున్నట్లు ఆదివాసి నాయక్‌పోడ్ సంఘం సభ్యులు తెలిపారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవాలకు సంబందించిన వివరాలను వెల్లడించారు. 13న దేవుని గదలను సంఘ భవనంలోకి తీసుకు రావడం, 14న గంగాస్నానం, స్వామి వారి ఊరేగింపు, 15న స్వామి వారి కల్యాణం, అగ్నిగుండం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం, జిల్లాలోని ఆదివాసి యువకులకు కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 17న వన భోజనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

■ ఘనంగ అయ్యప్ప మాస పూజోత్సవం

బాల్కొండ: మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం అయ్యప్ప మాస పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వాములు అయ్యప్పమెట్ల పూజ నిర్వహించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

■ శివలింగానికి ప్రత్యేక పూజలు



వేల్పూర్: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మంగళవారం రాత్రి హనుమాన్ మందిరం వద్ద శివపార్వతి కల్యాణం, దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీ భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపారాధన చేశారు. అర్చకులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు కరుణాకర్‌శర్మ, పవన్‌శర్మ, దేవీ ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

■ శివదీక్ష మాలధారణ ప్రారంభం



కమ్మర్‌పల్లి: మండలంలోని చౌట్‌పల్లి శ్రీ ఉమా పార్థీవ కోటిలింగేశ్వరస్వామి ఆలయం జాతరలో భాగంగా మంగళవారం పలువురు భక్తులు శివదీక్ష మాలధారణ తీసుకున్నారు. దీక్షాపరులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు గంగాప్రసాద్‌దీక్షిత్ మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా మాలధారణ చేశారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	సింగం అగైన్ (హిందీ) -1.00 7.35 భూల్ భూలయ్య-3 (హిందీ) - 4.10 10.45
స్క్రీన్-2 –	లక్కీ భాస్కర్(తెలుగు) -9.45 1.00 4.15 7.30 10.45
స్క్రీన్-3 –	అమరన్ (తెలుగు) -12.00 2.30 7.00 10.30
స్క్రీన్-4 –	క (తెలుగు) - 11.50 3.05 9.45 శ్రీమురళి బఖీర (తెలుగు) - 6.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	లక్కీ భాస్కర్ (తెలుగు)-10.40, 1.35, 4.35, 7.30, 10.30
స్క్రీన్-2	సింగం అగైన్(హిందీ)-10.35,7.30 క - (తెలుగు) - 01.40 అమరన్ - (తెలుగు) - 4.30 భూల్ భూలయ్య-3(హిందీ)-10.50
స్క్రీన్-3	అమరన్ - (తెలుగు) - 10.10, 1.20, 4.35, 7.35, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)



స్క్రీన్-1	భూల్ భులయ్య (హిందీ)-9.35 4.10 సింగం అగైన్(హిందీ) - 1.00, 7.35, 10.45
స్క్రీన్-2	లక్కీ భాస్కర్(తెలుగు)-9.45,1.00, 4.15,7.30,10.45
స్క్రీన్-3	సింగం అగైన్ (హిందీ)-9.25 క(తెలుగు)-12.35 7.15 శ్రీ మురళి బఖీర(తెలుగు)-3.50 భూల్ భులయ్య (హిందీ)-10.30
స్క్రీన్ -4	అమరన్(తెలుగు)-9.50 1.20 7.25 10.55 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్(ఇంగ్లీష్)-4.50
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	లక్కీ భాస్కర్ (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	క (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	75,572		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800